క్లుప్తంగా

రాజగోపుర నిర్మాణానికి విరాళం



దాతలకు బాండ్ అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: ఉరుకంద ఈరన్న స్వామి దేవాలయంలో చేపడుతున్న రాజగోపుర నిర్మాణానికి సోమవారం ఓ భక్తుడు విరాళం అందజేశారు. ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్ మాట్లాడుతూ.. నందికొట్కూరుకు చెందిన సుజాత, కృష్ణమూర్తి దంపతులు, వారి కుటుంబ సభ్యులు రూ.1,00,116ను దేవాలయ కార్యాలయంలో అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయించి స్వామి వారి తీర్థప్రసాదాలు, శేష వస్త్రాలు, బాండు అందజేశారు.

బసవేశ్వరుడికి విశేష పూజలు



ఉత్సవమూర్తిని ఊరేగిస్తున్న భక్తులు

కోసిగి: స్థానిక బసవన్న కొండలో కొలువుదీరిన శ్రీ బసవేశ్వర స్వామికి శ్రావణమాసం చివరి సోమవారం సందర్భంగా విశేష పూజలు చేపట్టారు. కుర్ణి కులబాంధవుల ఆధ్వర్యంలో సంప్రదాయబద్ధంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త కె.ఆర్.పరమేష్, అర్చకులు నాగరాజు స్వామి ఆధ్వర్యంలో స్వామి వారికి జలాభిషేకం,పంచామృతాభిషేకం,ఆకు పూజ, వెండి కవచ అలంకరణతో అలంకరించి మహా మంగళ హారతులు ఇచ్చారు. భక్తులు స్వామి వారికి నైవేద్యం, నారికేళాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంకాలం స్వామి వారి ఉత్సవ మూర్తిని కొండ నుంచి దిగువ ఈశ్వర దేవాలయం వరకు ఊరేగించారు.

ఉచిత శిక్షణ ప్రారంభం



ఉచిత శిక్షణను ప్రారంభించిన ఎమ్మెల్సీ మధుసూదన్

ఆదోనిఅర్బన్ : స్థానిక ఫెయిత్ హోంలో నిరుద్యోగ యువతకు కుట్టు, స్పోకెన్ ఇంగ్లిష్, కంప్యూటర్‌లో మెలకువలు నేర్పేందుకు ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణ కేంద్రాన్ని ఎమ్మెల్సీ మధుసూదన్ సోమవారం ప్రారంభించారు. ఫెయిత్‌హోం డైరెక్టర్ డానియల్ ప్రేమ్‌కుమార్, సభ్యులు పాల్గొన్నారు.

దొంగతనం కేసులో నిందితుడి అరెస్ట్



నిందితుడిని చూపుతున్న ఎస్‌ఐ చిన్న పీరయ్య

ఆదోనిరూరల్ : మండలంలోని పెద్దతుంబళం గ్రామంలో ప్రజావైద్యశాల ఎదురుగా ఉన్న ఓ ఇంట్లో దొంగతనం చేసిన కేసులో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు పెద్దతుంబళం ఎస్‌ఐ చిన్నపీరయ్య తెలిపారు. ఈనెల 9న రవినాయక్ ఇంట్లో దొంగతనం జరిగిన కేసులో కర్ణాటక రాష్ట్రం బళ్లారి జిల్లా జూనకంటితండా గ్రామానికి చెందిన మల్లికార్జుననాయక్ ఐదు తులాల బంగారం, 9 తులాల వెండి ఎత్తుకెళ్లాడు. సోమవారం ఉదయం సిరుగుప్ప చెక్‌పోస్టు వద్ద ఉన్నాడనే సమాచారంతో అరెస్ట్ చేసి.. బంగారం, వెండి రికవరీ చేసినట్లు చెప్పారు. నిందితుడిని రిమాండ్‌కు తరలినట్లు పేర్కొన్నారు.

మాతాశిశు సంక్షేమానికి ప్రాధాన్యత

పత్తికొండటౌన్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మాతాశిశు సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి నిధులు కేటాయింపు జరుగుతోందని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. సోమవారం అమరావతిలోని వెలగపూడి శాసనసభ కమిటీ హాల్ ఆవరణంలో మహిళా, శిశు, వికలాంగ, వయోవృద్ధుల సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం జరిగింది. కమిటీ సభ్యురాలైన పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ఈ సమావేశంలో మాట్లాడుతూ.. నాడు–నేడు కార్యక్రమం క్రింద అంగన్‌వాడీ కేంద్రాలకు నూతన భవనాలు నిర్మించడంతో పాటు, ఆయా కేంద్రాలలో మౌలిక వసతుల ఏర్పాటు జరిగిందన్నారు. టేక్ హోం రేషన్ కార్యక్రమం ద్వారా గర్భిణులు, బాలింతలకు ఇంటివద్దకే సంపూర్ణ పోషణ కిట్లను అందజేస్తున్నట్లు తెలిపారు.

ఈ–కేవైసీ తప్పనిసరి

వెల్దుర్తి: ప్రభుత్వ పథకాల అర్హతకు ప్రతి రైతు తాము సాగు చేసిన పంటల వివరాల నమోదు, ఈ–కేవైసీ తప్పనిసరి అని ఏఓ అక్బర్‌బాష సూచించారు. ఆయన సోమవారం రామళ్లకోట గ్రామంలో జరుగుతున్న పంట నమోదు, ఆర్బీకేలో జరుగుతున్న ఈ–కేవైసీ కార్యక్రమాలను పరిశీలించారు. నమోదుకు ఈనెల 15వ తేదీ, ఈ కేవైసీకు ఈనెల 19వ తేదీ ఆఖరు అన్నారు.

టీడీపీ బంద్‌కు స్పందన కరువు

- బంద్‌ను పట్టించుకోని ప్రజలు
- దౌర్జన్యంగా దుకాణాలను మూసివేయించిన ఆ పార్టీ నాయకులు
- ఒప్పుకోని దుకాణాల నిర్వాహకులపై దుర్భాషలు
- ప్రభుత్వ, ప్రైవేట్ వాహనాలు, ఆర్టీసీ బస్సుల టైర్లలో గాలి తీసి ప్రయాణికులను ఇబ్బంది పెట్టిన వైనం



ఆర్టీసీ బస్సును నిలిపివేసి గాలి తీస్తున్న టీడీపీ నాయకుడు



యథావిధిగా తెరుచుకున్న దుకాణాలు

ఆదోనిఅర్బన్ : రెండు రోజుల నుంచి 144 సెక్షన్ అమలులో ఉన్నా కూడా టీడీపీ నాయకులు నిబంధనలను ధిక్కరించి బంద్ పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురిచేశారు. అంతేగాకుండా ప్రభుత్వ, ప్రైవేట్ వాహనాలను ఆపి టైర్లలో గాలి తీసి ఇటు ప్రయాణికులను, వాహనదారులు, డ్రైవర్‌లను తీవ్ర ఇబ్బందులకు గురి చేశారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో చంద్రబాబునాయుడు అవినీతికి పాల్పడ్డాని కేసు రిమాండ్‌కు ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు బంద్‌కు పిలుపినిచ్చారు. అయితే వారి పిలుపును ప్రజలు పట్టించుకోలేదు. దీంతో కార్యక్రమాలన్నీ యథావిధిగా సాగాయి. పట్టణంలో పలువురు వ్యాపారులు దుకాణాలు తెరుచుకొని వ్యాపాలరు నిర్వహిస్తుండగా టీడీపీ నాయకులు దౌర్జన్యంతో దుర్భాషలాడుతూ షాపులను బంద్ చేయించారు. బంద్ చేయకుండా ఉన్న వారి షాపుల్లో దూరి సామగ్రిని బయట పడేశారు.

శాంతియుతంగా చేయాలి



ఏదైనా సంఘటనలు జరిగినప్పుడు ప్రజలను ఇబ్బందులు పెట్టకుండా శాంతియుతంగా నిరసన వ్యక్తం చేయాలి కానీ.. ఇలా భయాందోళనకు గురి చేయడం తగదు. నడి రోడ్డుపై నిలబెట్టి తమ వాహనాల గాలి తీస్తే మేం వాహనాన్ని ఎలా తీసుకెళ్లాలి. ఇలాంటి దౌర్జన్యకర బంద్‌లకు ప్రజలు ఎలా మద్దతు ఇస్తారు. వారు వాహనంలో గాలి తీసేయడంతో తీవ్ర ఇబ్బందులకు గురయ్యాం. మాకు బంద్ అని తెలియదు.

– నాగేంద్ర, డ్రైవర్

టీడీపీ నాయకుల చర్యలు సరికాదు



బంద్ పేరిట వాహనాల టైర్లలో గాలితీయం, వ్యాపారాలను బలవంతంగా మూయించడం వంటి చర్యలు టీడీపీ నాయకులకు తగదు. పేదలపైనే దౌర్జన్యం చేస్తున్నారు. ప్రతిరోజూ కూలీకి వెళ్తే గానీ మాకు కడుపు నిండదు. ఒకసారి బంద్ అని చెప్పి వాహనాలను నడిరోడ్డుపై నిలబెట్టి గాలి తీయడం దారుణం, లారీ అద్దాలను పగలగొట్టేందుకు కట్టెలు, రాడ్‌లు తీసుకొచ్చారు. అడ్డగించకపోతే ధ్వంసం చేసేవారు. ఇలాంటి అతి వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

– రాజు, డ్రైవర్

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష సమావేశం

కౌతాళం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై మంగళవారం సమావేశం ఏర్పాటు చేశామని ఎంపీడీఓ సుబ్బారాజు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండల స్థాయి సమీక్ష సమావేశానికి ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, పంచాయతీ కార్యదర్శులు తప్పక హాజరు కావాలని సూచించారు. వర్షం కాలం కావడంతో గ్రామాల్లో తీసుకోవాల్సిన చర్యలు, వాటి అమలుతీరుపై చర్చ జరుగుతుందన్నారు. సమావేశానికి వచ్చే కార్యదర్శులు ప్రతి గ్రామ సచివాలయం నుంచి ఇద్దరు యాక్టివ్ వలంటీర్లను తీసుకు రావాలని చెప్పారు.

రైతులను ఆదుకోవాలి

ఆదోనిరూరల్ : వర్షాలు లేక పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కె.లింగన్న కోరారు. సోమవారం మండలంలోని కొత్తూరు గ్రామంలో రైతుసంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో రైతులు సాగు చేసిన పంటలను పరిశీలించారు. చలింద్ర గంగన్న అనే రైతు నాలుగున్నర ఎకరాల్లో పత్తి సాగుచేయగా.. కేవలం ఒక క్వింటా పత్తి మాత్రమే చేతికొచ్చిందని, పంట సాగుకు రూ.లక్షన్నర పెట్టుబడి పెట్టారని చెప్పారు. ప్రభుత్వం మండలాన్ని యూనిట్‌గా గాకుండా గ్రామాన్ని యూనిట్‌గా తీసుకొని పంట నష్టం అంచనా వేసి రైతులను ఆదుకోవాలని కోరారు. సంఘం మండల అధ్యక్షుడు జి.రంగనాథ్, నాయకులు ఈరన్న, గోపాల్, రైతులు పాల్గొన్నారు.

ఈ–నామ్‌లో దిగుబడులను నమోదు చేయాల్సిందే



యార్డు గేటుబయట నిలిచిపోయిన వాహనాలు



గేటు బయట రైతులతో లావాదేవీలు చేస్తున్న వ్యాపారులు

- లేకపోతే వాహనాలను అనుమతించం
- పట్టించుకోని కమీషన్ ఏజెంట్లు
- లూజు పత్తి వాహనాలను నిలిపివేసిన అధికారులు
- గేటు బయటే లావాదేవీలు నడిపిన వ్యాపారులు

ఆదోనిఅర్బన్: ఆదోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో అమ్మకానికి వచ్చిన ప్రతి దిగుబడులను ఈ–నామ్‌లో నమోదు చేయాలి. అయితే గత నెల నుంచి కమీషన్ ఏజెంట్లు యార్డు అధికారుల ఆదేశాలను పట్టించుకోకపోవడంతో సోమవారం లూజు పత్తి దిగుబడుల వాహనాలను యార్డు గేటు బయటే నిలిపివేశారు. యార్డులో పత్తి బేళ్లు, వేరుశనగ, ఆముదాలు, పూల విత్తనాలు తదితర దిగుబడులను అనుమతించారు. దిగుబడులను రైతులపేరిట ఈ–నామ్‌లో ఎంట్రీ చేస్తే ఐడీ నంబర్ వస్తుంది. ఈ ఐడీ నంబర్‌తో దిగుబడులను పరిశీలించి వ్యాపారులు టెండర్ వేస్తారు. దానిని ఈ–నామ్‌లో వ్యాపారులు ఎంట్రీ చేయడంతో ఎవరైతే ఎక్కువ ధర వేసి ఉంటారో వారికే దిగుబడులను కేటాయించి వాటిని విక్రయించుకొని వారివారి ఫ్యాక్టరీలకు దిగుబడులను తీసుకెళ్తారు. కొందరు రైతులు పత్తిని బేళ్లుగా కాకుండా లూజుగా తెస్తుండటంతో వ్యాపారులు ఈ–నామ్‌లో నమోదు చేయకుండా నేరుగా కొనుగోలు చేస్తున్నారు. దీంతో జీరో వ్యాపారం చేయడానికి అవకాశముంటుందని అధికారులు పేర్కొంటున్నారు. ఈ విషయంపై యార్డు సెక్రటరీ రామ్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా కేవలం లూజు పత్తి వాహనాలను మాత్ర మే అనుమతించలేదన్నారు. రెండు నెలల నుంచి లూజు పత్తి వాహనాలను ఈ–నామ్‌లో ఎంట్రీ చేయాలని కమీషన్ ఏజెంట్లకు చెప్పినా పట్టించుకోకపోవడంతో అనుమతించలేదని చెప్పారు. టెండర్‌కు పెట్టకుండా నేరుగా క్రయ, విక్రయాలు చేయడంతో సరైన ధర లభించక రైతులు నష్టపోతున్నారని, ఈ ఉద్దేశంతోనే ఆ వాహనాలను అనుమతించలేదని స్పష్టం చేశారు. తెలియజేశారు. ఇక నుంచి కమీషన్ ఏజెంట్లు లూజు పత్తి దిగుబడులను వాహనాల్లో ఎంట్రీ చేయకపోతే లైసెన్సుపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా..ఈ–నామ్‌లో ఎంట్రీ చేయకపోవడంతో లూజు పత్తి వాహనాలను యార్డు అధికారులు అనుమతించలేదు. దీంతో కమీషన్ ఏజెంట్లు బయటనే క్రయ, విక్రయాలు జరిపారు.

ఇరవై ఏళ్లుగా అన్నదానం..

- ఉరుకుంద ఈరన్న స్వామి భక్తులకు అన్నదానం చేస్తున్న చిరుద్యోగి
- మొక్కులో భాగంగా ఏటా కందుకూరులో భక్తులకు భోజన వసతి



భక్తులకు అన్నదానం చేస్తున్న ఎరుకల నాగేష్ కుటుంబ సభ్యులు

కోసిగి: అతనో చిరుద్యోగి.. తనకు ప్రతి నెలా వచ్చే జీతం నుంచి కొంత మొత్తం తీసి పెట్టి ఆ మొత్తంతో ఏటా శ్రావణమాసం చివరి సోమవారం ఉరుకుంద ఈరన్న స్వామి పల్లకోత్సవం సందర్భంగా కందుకూరులో అన్నదానం చేస్తున్నారు. ఇలా ఇరవై ఏళ్లుగా తన మొక్కును తీర్చుకుంటున్నారు. కర్నూలు డీఈఓ కార్యాలయంలో దఫేదర్‌గా పనిచేస్తున్న ఎరుకల నాగేష్, తన భార్య లక్ష్మి, కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం కందుకూరులోని తుంగభద్రా నది ఒడ్డునున్న రామలింగేశ్వర స్వామి ఆలయ ఆవరణలో టెంట్ ఏర్పాటు చేసి తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక నుంచి వచ్చిన వేలాది మంది భక్తులకు భోజన వసతి కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఇది 20వ సంవత్సరమని, ఏటా మొక్కు చెల్లింపులో భాగంగా అన్నదానం చేస్తున్నామని చెప్పారు.

ఘనంగా దిబ్బలింగేశ్వర స్వామి ఉత్సవం



దిబ్బలింగేశ్వరస్వామి ఉచ్చాయాన్ని లాగుతున్న భక్తులు

హాలహర్వి: మండలంలోని గూళ్యం దిబ్బలింగేశ్వర స్వామి ఉత్సవాలను సోమవారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామివారికి పంచామృతాభిషేకం, జలాభిషేకం, కుంకుమార్చన, మహామంగళహారతి తదితర విశేష పూజలు నిర్వహించారు. ఆంధ్ర నుంచే గాక కర్ణాటక ప్రాంతం నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం భక్తుల జయజయ ధ్వనుల మధ్య దిబ్బలింగేశ్వర స్వామి వారి ఉచ్చాయాన్ని లాగారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ నాగేంద్ర ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

కమనీయం సిద్ధేశ్వర స్వామి రథోత్సవం





ఆలూరులో సిద్ధేశ్వర స్వామి రథాన్ని లాగుతున్న భక్తులు, ప్రత్యేక పూజలందుకున్న సిద్ధేశ్వర స్వామి

ఆలూరు రూరల్: శ్రావణ మాసం చివరి సోమవారం పురస్కరించుకుని ఆలూరు గ్రామంలోని కోట వీధిలో కొలువైన శ్రీ సిద్దేశ్వర స్వామి రథోత్సవం సోమవారం సాయంత్రం కమనీయంగా సాగింది. ఉదయం నుంచి ఆలూరుతో పాటు చుట్టుపక్కల గ్రామాల భక్తులు ప్రత్యేక వంటలు చేసుకుని స్వామి వారికి నైవేద్యం సమర్పించారు. అనంతరం విశేష పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం 6.45 నిమిషాలకు ఎదురు బసవన్న గుడి వరకు భక్తుల నడుమ రథోత్సవాన్ని లాగారు. భక్తులు భారీ ఎత్తున తరలివచ్చి రథోత్సవాన్ని తిలకించారు. భక్తులకు ఆలయ కమిటీ నిర్వాహకులు అన్న ప్రసాదాలు పంచిపెట్టారు. రథోత్సవం సందర్భంగా సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

గ్రావెల్ రోడ్ల ఏర్పాటు

కౌతాళం: మండలంలోని కాత్రికి గ్రామంలో రెండు చోట్ల గ్రావెల్ రోడ్లు వేశారు. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి సొంత నిధులతో సోమవారం పనులు చేయించారు. కాత్రికి గ్రామంలో పొదలకుంట రోడ్డుపై గ్రావెల్ వేశారు. అలాగే..మారికాంబ దేవి దేవాలయం వరకు రోడ్డు అధ్వాన్నంగా ఉండడంతో జేసీబీతో చదును చేసి గ్రావెల్‌ను వేశారు. సర్పంచ్ వెంకప్ప, ఎంపీటీసీ వసంతకుమార్ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

ముద్దాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

ఆదోనిటౌన్ : పట్టణంలోని రెండో వార్డు బావూజీపేటలో వెలిసిన శ్రీ ముద్ద ఆంజనేయస్వామి వారికి శ్రావణమాసం చివరి సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కౌన్సిలర్ సురేష్, మాజీ కౌన్సిలర్ తిమ్మప్ప ఆధ్వర్యంలో పూజలు, అభిషేకాలు జరిగాయి. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

కారు, ఆటో ఢీకొని నలుగురికి గాయాలు

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని చిన్నహుల్తి గ్రామ సమీపంలోని మలుపు వద్ద ఎదురెదురుగా వస్తున్న కారు, ఆటో సోమవారం ఢీకొన్న ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. అనంతపురానికి చెందిన నరసింహులు కుటుంబ సభ్యులు కౌతాళం మండలం ఉరుకుంద ఈరన్న స్వామిని దర్శించుకుని కారులో తిరిగి వస్తున్నారు. ఈ కారు అదుపు తప్పి పత్తికొండ నుంచి ఆదోనికి వెళ్తున్న హోసూరుకు చెందిన ప్రయాణికుల ఆటోను ఢీకొంది. ఆటోలో ఉన్న ఉమ్మి, రేష్మ, కారులో ప్రయాణిస్తున్న నరసింహులుతో పాటు మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

హొళగుంద: ఆత్మహత్యకు ప్రయత్నించిన నాగరకణ్వి గ్రామానికి చెందిన చాకలి పరమేష్ (35) అనే వ్యక్తి కోలుకోలేక మృతి చెందినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు సోమవారం విలేకరులకు తెలిపారు. మద్యానికి బానిసైన పరమేష్ మద్యం తాగేందుకు తన భార్య డబ్బులు ఇవ్వలేదని ఈ నెల 9న పురుగు మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. కుటుంబ సభ్యులు చికిత్స కోసం బళ్లారి ఓపీడీలో చేర్పించారు. కోలుకోలేక ఆదివారం రాత్రి పరమేష్ మృతి చెందాడు. మృతుడికి భార్య ఈరమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

స్పందన సమస్యలను పరిష్కరించాలి



స్పందన కార్యక్రమంలో ప్రజల సమస్యలను వింటున్న సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

ఆదోని రూరల్ : స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలకు వెంటనే పరిష్కారం చూపాలని ఆదోని సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్ సూచించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో పాల్గొని డివిజన్‌లోని ఆయా మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు.

సమస్యల్లో కొన్ని..

- పెద్దకడబూరు మండలం జాలవాడికి చెందిన హుసేన్‌పీరాబాబుకు కమ్మలదిన్నె గ్రామంలో సర్వే నంబర్ 296, 297లలో 1.01 ఎకరాల భూమి ఆన్‌లైన్‌లో నమోదు చేసి పట్టాదారు పాసుపుస్తకం మంజూరు చేయాలని అర్జీ అందజేశారు.
- పెద్దకడబూరు మండలం బస్సులదొడ్డి గ్రామానికి చెందిన పెద్దలక్ష్మన్నకు సర్వేనంబర్ 329లో రెండు ఎకరాల పొలం ఉందని, కోర్టు పరిధిలో ఉన్నా దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారని, విచారణ చేసి న్యాయం చేయాలని కోరారు.
- ఆదోని పటట్టంలో శివశంకర్‌కాలనీలో నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసినా చుట్టూ కంచె వేయలేదని, ప్రమాదం జరగకుండా ముందే కంచె ఏర్పాటు చేయాలని కాలనీవాసులు మల్లేష్, రాముడు, రాధ, చాంద్‌బాషా అర్జీ సమర్పించారు.
- కౌతాళంకు చెందిన లింగప్పకు ఇంటి నంబర్ 8/118 ఇంటి స్థలం పక్కన ఐదు అడుగుల స్థలం కోర్టు పరిధిలో ఉన్నా అక్రమంగా బాత్‌రూం నిర్మిస్తున్నారని, విచారించి చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందజేశారు.

కార్యక్రమంలో కార్యాలయ పరిపాలన అధికారి గోవింద్‌సింగ్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, గృహ నిర్మాణ శాఖ డిప్యూటీ ఇంజినీర్ రవికుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చేతన్‌ప్రియ, బీసీ వెల్ఫేర్ లక్ష్మీనారాయణ, ఎస్సీ వెల్ఫేర్ సుధాకర్, డిప్యూటీ తహసీల్దార్ వలీబాషా పాల్గొన్నారు.

భళా..మరియప్ప



210 కేజీల ఇసుక బస్తా ఎత్తుతున్న మరియప్ప



నగదు బహుమతి అందజేస్తున్న దృశ్యం

కోసిగి: 170 కేజీల రాతి గుండు.. 210 కేజీల ఇసుక బస్తాను కర్ణాటక రాష్ట్రానికి చెందిన శారదహళ్లి మరియప్ప నాయక్ అవలీలగా ఎత్తి ప్రజల నుంచి ప్రశంసలు అందుకున్నారు. అదే రాష్ట్రానికి చెందిన యల్లాలింగ అనే వ్యక్తి 150 కేజీల రాతి గుండు, 190 కేజీల ఇసుక బస్తాను ఎత్తారు. వీరికి వరుసగా ప్రథమ, ద్వితీయ బహుమతులు అందజేశారు. ఉరుకుంద ఈరన్న స్వామి పల్లకోత్సవం సందర్భంగా కురుకుంద గ్రామంలో సోమవారం క్రీడా పోటీలు నిర్వహించారు. తిప్పలదొడ్డి నుంచి కందుకూరు గ్రామం వరకు 5 కి.మీ. పరుగు పందెం పోటీల్లో పెద్దతుంబళం గ్రామానికి చెందిన దొడ్డయ్య ప్రథమ స్థానంలో నిలిచి రూ. 3100, ద్వితీయ బహుమతి కోసిగి లక్ష్మన్న కు రూ.2100 అందజేశారు. అలాగే.. లాంగ్ జంప్, ట్రిపుల్ జంప్ క్రీడల్లో గెలుపొందిన వారికి ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజు గౌడ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బెట్టన గౌడ, ఎంపీపీ ఈరన్న నగదు బహుమతులు అందజేశారు.

నెరవేరిన సొంతింటి కల




నూతనంగా నిర్మించిన ఇంటి వద్ద లబ్ధిదారుతో వై.సీతారామిరెడ్డి

మంత్రాలయం: పేదవాడి సొంతింటి కలను నేరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని టీటీడీ పాలక మండలి సభ్యుడు వై.సీతారామిరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రాఘవేంద్రనగర్ సూగూరు రహదారిలో ఉన్న జగనన్న కాలనీల్లో హేమవతి అనే లబ్ధిదారు నూతనంగా నిర్మించిన ఇంటి గృహ ప్రవేశం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సకాలంలో బిల్లులు రావడంతో నిర్మాణం పూర్తి చేసుకున్నామని లబ్ధిదారు సంతోషం వ్యక్తం చేసింది. సర్పంచ్ తెల్లబండ్లభీమయ్య, వ్యవసాయ సలహా మండలి సభ్యులు మల్లికార్జున, ఉపసర్పంచ్ హోటల్ పరమేష్, ఎంపీటీసీ వెంకటేష్‌శెట్టి, జనార్ధన్‌రెడ్డి, శివకుమార్,భాస్కర్, వీరారెడ్డి ఉన్నారు.

వైఎస్సార్ బీమా నిరుపేదలకు వరం

హొళగుంద: మండల పరిధిలోని ఇంగళదహాళ్ గ్రామానికి చెందిన పింజరి దస్తగిరి (35) అనారోగ్యంతో మరణించాడు. సోమవారం అతని భార్య కాదిరమ్మకు వైఎస్సార్ బీమా తక్షణ సాయం రూ.10 వేలు నగదును సర్పంచ్ ప్రభావతమ్మ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకట్రామిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యుడు ప్రహ్లదరెడ్డి చేతుల మీదుగా సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ రాఘవేంద్ర, వలంటీర్ మాబు అందజేశారు. వైఎస్సార్ బీమాలో మృతుడి భార్య నామినీగా ఉండడంతో ఆమెకు ఈ నగదును అందజేస్తూ.. త్వరలో మిగతా సొమ్ము బ్యాంకు ఖాతాలో జమ అవుతాయని తెలిపారు. ధైర్యంగా ఉండాలని అండగా ఉంటామని బాధిత కుటుంబసభ్యులకు భరోసా ఇచ్చారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



రాజశేఖరరెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

వెల్దుర్తి: రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు పొందిన పుల్లగుమ్మి జెడ్పీ హైస్కూల్ గణిత ఉపాధ్యాయుడు రాజశేఖరరెడ్డిని పాఠశాల ఉపాధ్యాయ బృందం, సిబ్బంది ఘనంగా సన్మానించారు. సోమవారం పాఠశాలలో హెచ్‌ఎం సుభాషిణి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ నాయుడు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి, శాలువాలు కప్పి, బహుమతులు అందించి అభిమానం చాటుకున్నారు. హెచ్‌ఎం మాట్లాడుతూ.. తమ పాఠశాల నుంచి రాష్ట్రస్థాయి అవార్డు పొందడం గర్వంగా ఉందన్నారు. సన్మాన గ్రహీత మాట్లాడుతూ అవార్డు పొందడం తన బాధ్యతను మరింత పెంచిందన్నారు. ఉపాధ్యాయులు జోసెఫ్, నాగేశ్వరరెడ్డి, మురళీధర్, ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.